# చదరపు ఏనుగు

"సుబ్బరామయ్యను ఉదయం కేర్ హాస్పిటల్లో చేర్పించారట"

నిద్ర లేవగానే విన్న వార్త కలవరపెట్టింది. మేమిద్దరం దాదాపు ఒకేఈడు వారం కావటం ఓ కారణమైతే, యిద్దరం కలిసి ఏజి ఆఫీసులో ముప్పయ్ మూడేళ్ళు పనిచేసిన సాన్నిహిత్యం మరో కారణం. ఆర్నెల్ల క్రితం నేను, నాలుగు నెల్ల క్రితం సుబ్బరామయ్యా పదవీ విరమణ చేసాం.

తొందరగా తెమిలి హాస్పిటల్‌కెళ్ళాను. అది హాస్పిటల్‌లా లేదు. స్టార్ హోటల్లా ఉంది. విశాలమైన ఏసి గది . . . రెండు మంచాలు . . . మెత్తటి పరుపు . . . రెండు కుర్చీలు . . . ఓ సోఫా . . . కలర్ టీవి . . . చిన్న ఫ్రిజ్ . . .

గదిలో సుబ్బరామయ్య లేడు. నన్ను చూడగానే అతని భార్య గొల్లుమంది. "పిల్లలు అమెరికా వెళ్ళి మమ్మల్ని మర్చిపోయినా యిన్నాళ్ళూ ఒకరికొకరం తోడుగా ఉన్నాంలెమ్మని ధైర్యంగా ఉండేది. యిపుడు నన్ను ఒంటరిదాన్ని చేసి వెళ్ళిపోతారేమోనని భయంగా ఉందన్నయ్యా" అంది.

"ఛ అలా మాట్లాడకూడదు. అంతా మంచే జరుగుతుంది. ఆరోగ్యం విషయంలో సుబ్బరామయ్య బహు జాగ్రత్తపరుడు కదా. యింతకూ ఏమైంది?"

"ఉదయం నాల్గింటికి గుండెనొప్పంటూ మెలికలు తిరిగిపోయారు. వళ్ళంతా చెమటలు. మొదట కాళ్ళూ చేతులు ఆడలేదు. ఎందుకైనా మంచిదని ఆటోలో ఈ ఆస్పత్రికి తెచ్చా. రాగానే యింటెన్సివ్ కేర్‌లోకి తీసుకెళ్ళిపోయారు. మరి కొద్దిసేపు ఆలస్యమై ఉంటే ఆయన దక్కేవారు కాదని చెప్పారు" మరోసారి ఆవిడ కన్నీళ్ళ పర్యంతమైంది.

"మనిషి సన్నగా రివటలా ఉంటాడు. నిన్న సాయంత్రం ఈవెనింగ్ వాక్‌కి కూడా వచ్చాడాయె. కాఫీ, టీలు కూడా అలవాటులేని వ్యక్తి. మితాహారి. అన్ని మంచి అలవాట్లున్న సుబ్బరామయ్యకు గుండె నొప్పేమిటీ... కలికాలం కాకపోతే"

"ఏం చెప్పమంటారు? నిన్న సాయంత్రం ఎప్పటికిమల్లె ఈవినింగ్ వాక్‌కెళ్ళి

తిరిగొచ్చారు. ఓ అరగంట తర్వాత శ్రీనివాసరావు గారొచ్చారు"

"ఎవరూ . . . మాతో పాటే ఉద్యోగం చేస్తూ పదేళ్ళ క్రితం వాలంటరీ రిటైర్మెంట్ తీసుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారంలోకి దిగాడూ . . . అతనేనా?"

"ఆ . . . ఆ మహానుభావుడే . . . మీకు తెల్సుగా. శంషాబాద్ దగ్గర మాకో ఐదు వందల గజాల స్థలం ఉండేది"

"ఎందుకు తెలీదూ . . . శ్రీనివాసరావు బలవంతం మీదే కదూ కొంది . . . నన్ను కూడా కొనమని నానా తిప్పలు పెట్టాడు. గజం రెండొందలని చెప్పినట్టు గుర్తు. అంత దూరంలో స్థలాలు కొంటే కాపాడుకోలేక చావాలని వద్దన్నాను. జలగలా వెంటబడి వదలడే . . . అమ్మో . . . ఈ ఇన్సూరెన్స్ వాళ్ళనుంచీ, ప్లాట్లు అమ్మే ఏజంట్ల నుంచీ మనల్ని ఆ దేవుడు కూడా కాపాడలేడు"

"ఏడాది క్రితం ఆ స్థలాన్ని మా మూడో అమ్మాయి పెళ్ళికోసమని అమ్మేశాం"

"అవునవును. సుబ్బరామయ్య నాతో చెప్పాడు"

"అదే యిపుడు నా కొంప ముంచేలా ఉంది"

"మరలా స్థలాలు కొనమని పీడిస్తున్నాడా ఏమిటి?"

"అలాగైనా బావుండు . . . నాకీ కష్టం రాకపోను. వచ్చినాయన పూర్కోక మేమమ్మిన స్థలం గురించి చిలువలు పలువలు చెప్పాడు. తను వారించినా వినకుండా మేము తొందరపడి గజం ఐదువందల లెక్కన అమ్మేసి పొరపాటు చేశామట. ఇపుడదే స్థలం గజం పాతికవేలు పలుకుతోందట. యిపుడమ్మి ఉంటే కోటి పాతిక లక్షలు వచ్చి ఉండేవని లెక్కలేసి మరీ చెప్పాడు"

"శంషాబాద్‌లో అంతర్జాతీయ విమానాశ్రయమొస్తుందని తెలిశాక అక్కడి భూముల ధరలు విపరీతంగా పెరిగిన మాట మాత్రం వాస్తవం"

"ఆ రాత్రంతా ఈయనకు కంటిమీద కునుకు లేదు. ఒకటే పలవరింతలు . . . పొరపాటు జరిగిపోయిందే . . . అయ్యో. కోటి రూపాయలు నష్టపోయానే . . . బంగారంలాంటి స్థలాన్ని రెండున్నర లక్షలకు అమ్మేసుకున్నానే . . . పిల్ల పెళ్ళికి అప్పు చేసినా వడ్డీతో కలిపి నాలుగైదు లక్షలు దాటేది కాదు. అలాగైనా మనకు కోటి ఇరవై లక్షలు మిగిలుండేవి . . . చేతులారా కోటి రూపాయలు నష్టం చేసుకున్నాను . . . అంటూ ఒకటే దిగులు పడిపోయారు. అన్నం ముట్టుకుంటే ఒట్టు. ఉదయం గుండె పట్టుకుని మెలికలు తిరిగిపోయారు"

నాకు శ్రీనివాసరావు నిర్వాకం మీద చాల కోపమొచ్చింది. "వాడికి బుద్ధుందా అసలు . . . కడుపుకి అన్నం తింటున్నాడా గడ్డి తింటున్నాడా? లాభం వచ్చే మాటేమైనా

చెప్పాలిగాని జరిగిపోయిన నష్టాన్ని భూతద్దంలో చూపించి బెంగపడేట్టు చేస్తాడా? అయినా ఎపుడైనా వూహించామా గజం నేల పాతిక వేల ధర పలుకుతుందని . . . పిల్ల పెళ్ళికి అవసరమొచ్చిందీ అమ్మేశాం. మనలాంటి మధ్యతరగతి జీవులు స్థలాలు కొనుక్కునేది యిలాంటప్పుడు అక్కరకొస్తాయని కదా" అన్నాను.

యింటికెళ్ళేముందు వాణ్ణి పట్టుకుని నాలుగు దులిపెయ్యాలని నిర్ణయించుకున్నాను. పదేళ్ళ క్రితం వరకూ శ్రీనివాసరావు మాతోపాటే వనస్థలిపురంలో ఉండేవాడు. ప్లాట్ల వ్యాపారం మొదలెట్టాక బాగా సంపాయించాడు. రెండు మూడు కాంప్లెక్సులు కూడా కట్టి సొమ్ము చేసుకున్నాడు. హిమాయత్‌నగర్‌లో ఇంద్రభవనం లాంటి యిల్లు కట్టుకున్నాడు.

నేను వెళ్ళే సమయానికి తమ విశాలమైన లాన్‌లో ఉన్న తూగుటుయ్యాలలో కూచుని భార్యతో కబుర్లు చెప్తున్నాడు శ్రీనివాసరావు.

నన్ను చూడగానే లేచి ఎదురొచ్చి కౌగిలించుకున్నంత పని చేశాడు. "అబ్బ . . . ఆడబోయిన తీర్థం ఎదురైనట్టుంది. నేనే మీ యింటికొద్దామనుకుంటున్నా నువ్వే వచ్చేశావు" అన్నాడు. అతని భార్య "కాఫీ పంపిస్తానుండండి" అంటూ లోపలికెళ్ళిపోయింది.

రాజభవనంలాంటి యిల్లు . . . హంగూ ఆర్భాటమూ . . . అష్టైశ్వర్యాలతో తులతూగుతున్న ఒకప్పటి నా సహోద్యోగి శ్రీనివాసరావు . . . వచ్చిన విషయం మర్చిపోయాను . . . జెలసీ విషంలా నా నరనరాన పాకుతూ . . .

అతను స్వచ్ఛంద పదవీ విరమణ చేస్తున్నాడని తెలిసి "బంగారంలాంటి కేంద్రప్రభుత్వ ఉద్యోగం వదిలేసి వ్యాపారం చేస్తానంటావేమిటి మూర్ఖంగా" అన్నాను. అప్పుడతను నన్ను కూడా ఆ ఉచ్చులోకి లాగడానికి ప్రయత్నించాడు. యిద్దరం కలిసి బిజినెస్ చేద్దామని బలవంత పెట్టాడు.

"ఈ ఉద్యోగాల్లో ఏముంది చెప్పు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గాడిద చాకిరీ చేస్తే నెలకు పది పదిహేను వేలు . . . అంతేగా. ఈ రోజుల్లో ఆ డబ్బు ఏ మూలకు? అదే బిజినెస్‌లో అయితే లక్షలు సంపాదించొచ్చు" అన్నాడు.

"సంపాదించనూ వచ్చు, ఉన్నదంతా పోగొట్టుకోనూ వచ్చు" అన్నాను ఎగతాళిగా.

అతను నవ్వాడు. "ఒకప్పటి సామెత గుర్తుందా నీకు? భూమిని నమ్ముకున్నవాడెప్పుడూ పాడైపోడని. అదిప్పుడు పచ్చి నిజం. భూమిలో వ్యవసాయం చేయడం కాదు. భూమితో వ్యాపారం చేయడం అన్మాట. యిందులో లాభం తప్ప నష్టమొచ్చే ప్రసక్తేలేదు. నామాట నమ్ము" అన్నాడు. నేను నమ్మలా. ప్రతిఫలంగా ఇపుడు పశ్చాత్తాపాన్ని గుండె మీద పర్వతంలా మోస్తూ . . .

"మనం వ్యాపారంలో భాగస్వాములౌతామనుకున్నా. నువ్వు కలిసి రాలేదు. పోన్లే

అని సరిపెట్టుకున్నా. కనీసం రిటైరైనాక ఆ డబ్బునేం చేయాలని నా దగ్గరకు సలహాకొస్తావనుకున్నా. రాకపోతే బాధ పడ్డా. నీకేదోవిధంగా సహాయపడాలని తాపత్రయం. యింతకూ రిటైరైనాక వచ్చిన డబ్బుని ఏం చేశావు?" అని అడిగాడు శ్రీనివాసరావు.

"పది లక్షల పై చిలుకొస్తే బ్యాంకులో వేశాను"

"అనుకున్నాన్లే . అందరూ చేసే పొరపాటే నువ్వూ చేశావు. బ్యాంకులో వేస్తే ఏమొస్తుంది? ఆరు శాతం వడ్డీ కూడా రాదాయె. ఎంత బ్యాడ్ ఇన్వెస్ట్‌మెంటో ఆలోచించావా?"

"యింకేం చేయమంటావు చెప్పు. చిట్‌ఫండ్ కంపెనీల్లో పెడ్దామంటే అన్నీ మన నెత్తిన శఠగోపం పెట్టేవేనాయె. ఎక్కువ వడ్డీ యిచ్చే బ్యాంకుల్లో పెడ్దామంటే కృషి బ్యాంక్‌లానో, వాసవీ బ్యాంక్‌లానో బిఛానా ఎత్తేస్తాయని భయం. అందుకే సేఫ్‌గా ఉంటుందని స్టేట్ బ్యాంక్‌లో ఫిక్సెడ్ చేశా."

"ఘనకార్యం చేశావులే. సేఫ్ సేఫ్ అనుకోబట్టే మీరందరూ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టున్నారు. రిస్క్ తీసుకోవాలి. ఈ రోజుల్లో ఎంత రిస్క్ తీసుకుంటే అంత లాభం. అదే డబ్బుతో స్థలం కొని ఉంటే ఈ పాటికి రెండింతలయి ఉండేది. పది లక్షలకు పది లక్షలు లాభం"

నా కళ్ళ ముందు నేను పోగొట్టుకున్న పదిలక్షల లాభం విశ్వరూపంలో కన్పించి కళ్ళు తిరిగాయి.

"ఆర్నెల్లలో అంత లాభం వస్తుందా?"

"నువ్వు పేపర్ చదవటం లేదా? మొన్నటికి మొన్న కూకట్‌పల్లిలో ప్రభుత్వ స్థలాలు వేలం వేస్తే గజం యాభైవేలు పలికింది. మరునాడే ఆ చుట్టుపక్కల రేట్లన్నీ పెరిగి కూచున్నాయి. జూబ్లీహిల్స్‌లో రోడ్ నెంబర్ 36లో గజం ధర లక్ష రూపాయలు. అక్షరాలా లక్ష . . . బంగారం పరిచినా అంత ధర పలకదు. పదేళ్ళ క్రితం మాదాపూర్‌లో ప్లాట్లు కొనమని బలవంత పెట్టాను గుర్తుందా?"

"లేకేం? అప్పుడు గజం మూడు వేల ధర చెప్పినట్లు గుర్తు. సిటీకి అన్ని కిలోమీటర్ల దూరంలో అంత డబ్బు పెట్టి కొనాలా అని వూర్కుండిపోయాను"

"అదే స్థలం యిప్పుడు గజం ముప్పైవేల పైనే. అంటే పదేళ్ళలో పదింతలైందన్మాట. యింతగా లాభాన్ని అందించే పెట్టుబడి మరొకటి లేదంటే నమ్ము. యిక్కడ రేటు అమ్మే వ్యక్తి నిర్ణయించటం లేదు. అతను గజం పాతిక వేలంటే కొనేవాళ్ళు పోటీలు పడి ఇరవై ఎనిమిదికో ముప్పయ్‌కో ఎగరేసుకు పోతున్నారు"

అంటే మనం స్థలాన్ని కొనేటప్పుడు ఎలుక పిల్లలా ఉండి - కొన్ని నెలల తర్వాత

అమ్మేటపుడు అది ఏనుగులా మారిపోతుంది. నా కళ్ళ ముందు రెక్కలు తొడుక్కుని ఎగుర్తున్న తెల్లటి ఐరావతాలు . . .

"సరే యింతకూ నన్నేం చేయమంటావు?" భారమంతా అతని మీద మోపుతూ అడిగా.

"అలా అడిగావు బావుంది. మహేశ్వరం మండలం తెలుసు కదా. దానికి పది కిలోమీటర్ల దూరంలో రోడ్డుకి దగ్గరగా ఐదెకరాల స్థలం అమ్మకానికుంది. ఎకరం ఆరు లక్షలు చెప్తున్నాడు. ఐదుకి బేరం కుదరొచ్చు. కొని ఓ నాలుగు నెలల తర్వాత అమ్మేసినా ఎకరానికి ఏడెనిమిది లక్షలు పలుకుతుంది"

"నాలుగు నెలల్లో అంత పెరుగుతుందా?"

"తప్పకుండా పెరుగుతుంది. మార్కెట్‌ని బాగా స్టడీ చేసి చెప్తున్నాను. ఖరారైన ఔటర్ రింగ్ రోడ్‌కి కేవలం రెండు కిలోమీటర్ల దూరంలో ఉందీ పొలం. ఎకరా పదిలక్షలైనా ఆశ్చర్యపోనక్కరలేదు"

"మరి ఐదెకరాలంటున్నావు. నా దగ్గరున్నది పది లక్షలే"

"నువ్వు రెండెకరాలు కొనుక్కో, మిగతా మూడు మరెవరికైనా అమ్మేస్తాను"

"ఎకరా ఐదుకన్నా తగ్గదా?"

"నేను చెప్పింది మినిమమ్ ధర. ఆరు లక్షలు చెప్పినా అరనిమిషంలో డీల్ సెటిల్ చేసుకునేవాళ్ళున్నారు."

"సరే. ఎన్ని రోజుల్లో డబ్బులు సర్దుబాటు చేయాలి?"

"ఎన్నో రోజులా . . . భలేవాడివే. రేపో ఎల్లుండో తెచ్చివ్వు. యింకా ఆలస్యమైతే రేట్లు పెరిగిపోయే ప్రమాదముంది."

సరేనని చెప్పి యింటికి చేరుకున్నాను. మనసు నిండా స్థలాలే . . . ఎకరాలు ఎకరాలు . . . మెదణ్ణి చదరపు గజాలకింద విభజించినట్లు . . .

నా భార్యకు విషయం చెప్పాను.

"ఔనండీ. నేనే ఈ విషయం మీకు చెప్పాలనుకున్నా. గచ్చిబౌలి దగ్గర హుడా లే అవుట్ ప్లాట్లున్నాయని నా స్నేహితురాలు చెప్పింది. వాళ్ళు ఐదు వందల గజాల స్థలం కొన్నారట. గజం ప్రస్తుతం ఐదువేలట. కొన్ని రోజులు పోతే గజం పదివేలు కావొచ్చని చెప్పింది"

"మన దగ్గరున్న పది లక్షలకు రెండు వందల గజాల స్థలమొస్తుంది. దాని కన్నా మహేశ్వరం దగ్గర రెండెకరాలు కొనటమే మంచిదేమో" అన్నాను.

"ఏది మంచో ఏది చెడో అర్థం కావటం లేదండీ. మన దగ్గర మిగిలింది ఆ పది

లక్షలే. బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోండి"

ఆమె మాటల్లో నిజముంది. ఈ విషయంలో తొందరపడి చేతులు కాల్చుకోవటం కంటే నెమ్మదిగా ఆలోచించి, నలుగుర్ని సంప్రదించి అడుగేయటం మంచిదనిపించింది. ఈవెనింగ్ వాక్‌కి వెళ్ళినపుడు ఒకరిద్దరు స్నేహితుల్ని సలహా అడిగాను.

"ఇదంతా ఓ బుడగలాంటిది. పెరిగి పెరిగి ఎప్పుడో ఓ సారి టప్పున పేలిపోతుంది. అలా పేలటానికి ముందు స్థలాల్లో పెట్టుబడి పెట్టినవాళ్ళంతా నెత్తిమీద గుడ్డేసుకోవాల్సిందే" అన్నాడు ఒకతను.

"బెంగుళూరులో అలాంటి పరిస్థితి ఏర్పడింది. రియల్టర్ల మాయాజాలం వల్ల స్థలాల ధరలు, అపార్ట్‌మెంట్ల ధరలు పెరిగి పెరిగి ఆకాశాన్నంటి . . . టక్కున పడిపోయాయి. హైద్రాబాద్‌లో కూడా అటువంటి పరిస్థితి ఎదురయ్యే ప్రమాదముంది" అన్నాడు మరొకతను.

నాకు భయమేసింది. రియల్ ఎస్టేట్ రంగంలో నిష్ణాతులైన ఒకరిద్దర్ని సంప్రదించాను. మరో రెండేళ్ళ వరకు ఢోకా లేదని, స్థలాల ధరలు పెరుగుతూనే ఉంటాయని భరోసా ఇచ్చారు.

ఈ మీమాంసలో నెల దాటిపోయింది. ఎప్పటిలా శ్రీనివాసరావు జలగలా వెంటపడి పీడిస్తాడనీ– ఎలా తప్పించుకోవాల్రా భగవంతుడా అని భయపడ్డాను గాని అతను పత్తాలేడు. కనీసం ఫోనుకూడా చేయలేదు.

చివరికి రెండెకరాల స్థలం కొనడానికే నిర్ణయించుకుని అతనింటికెళ్ళా. లేడు. రావడానికి గంట పట్టొచ్చంటే చిక్కడపల్లి వెళ్ళి కొన్ని పనులు చూసుకుని రాత్రి ఎనిమిదింటికి మరలా వెళ్ళా. అప్పుడే వచ్చినట్టున్నాడు. ఫోర్డ్ కారు దిగుతూ కన్పించాడు. "రావోయ్ . . . నెలదాటిపోయింది ఏమైపోయావ్ . . . నీకు ఇంట్రెస్ట్ లేదనుకున్నా" అన్నాడు.

"పదిలక్షల పెట్టుబడి కదా. కాస్త ఆలోచించి పెడితే మంచిదనీ . . ." నాన్చాను.

"అదే మీతో వచ్చిన సమస్య . . . ఇప్పుడంతా ఫాస్ట్ యుగం . . . వేగం . . . విపరీతమైన వేగం. ఆ వేగాన్ని అందుకోలేకపోతే మనం వెనకబడిపోతాం"

"ఔననుకో. స్థలాల విషయంలో నీకున్న అవగాహన మాకుండదుగా. భయమనిపిస్తుంది. నువ్వు చెప్పిన రెండెకరాల స్థలం కొనడానికే నిర్ణయించుకున్నా. నువ్వు చెప్తే పది లక్షలు రేపు డ్రా చేసి తెస్తాను.

పెద్దజోక్ విన్నట్టు నవ్వాడు. "ఏ కాలంలో ఉన్నావు? ఇంకెక్కడి స్థలం? ఇపుడు

ఎకరం పది లక్షలకు తక్కువ లేదు. నేను చెప్పినపుడే కొనుంటే నూటికి నూరు శాతం లాభం వచ్చి ఉండేది"

నేను ఆశ్చర్యంతో నోరెళ్ళబెట్టాను.

"నెల్రోజులకే పెరిగిపోయిందా?" అన్నాను.

"నెలదాకా ఎందుకు . . . రోజురోజుకి రేట్లు పెరిగిపోతున్నాయి. సాఫ్ట్‌వేర్ జీతాల గురించి నీకు తెల్సుగా. పాతికేళ్ళ వయసుండదు జీతాలు మాత్రం లక్షల్లో ఉంటున్నాయి. వీళ్ళకు తోడు ఎన్నారైలందరూ తమ పెట్టుబడినంతా యిక్కడి స్థలాల్లో పెట్టడం సేఫ్ అనుకొంటున్నారు. అందుకే ధరలు వేలం వెర్రిగా పెరిగిపోతున్నాయి."

"మరిప్పుడెలా" అన్నాను దిగులుగా.

చేతికందిన స్వర్గం చేజారిపోయినట్లనిపించింది. నా అంత దురదృష్టవంతుడు ఉండడని నిందించుకున్నా.

"చెప్పానుగా . . . తొందరపడకపోతే మనకు దక్కాల్సింది మరెవరో తన్నుకుపోయే పరిస్థితి. ఓ పని చేద్దాం. ఆ స్థలానికి దగ్గర్లోనే మరో స్థలం అమ్మకానికుంది. ఎకరా పది లక్షలు. కొంటావా?"

"కొన్నాక రేటు పెరుగుతుందంటావా?"

"అందులో అనుమానం అక్కర్లేదు. ఓ సంవత్సరంలో పాతిక లక్షలు కావటం గ్యారంటీ"

నా ఆశలకు రెక్కలొచ్చాయి. పది లక్షలు పెట్టుబడి పెడితే సంవత్సరానికి పదిహేను లక్షలు లాభం.

మరునాడే పది లక్షలు డ్రాచేసి అతని చేతిలో పెట్టాను. పది రోజుల్లో రాతకోతలు పూర్తయ్యాయి.

అప్పట్నుంచి వారానికోసారి శ్రీనివాసరావును కల్సుకోవటమూ, నా పొలం ఏ రేటు పలుకుతుందో వాకబు చేయటం అలవాటుగా మారింది.

స్థలం కొని మూడు నెలలు దాటాక "నువ్వు అదృష్టవంతుడివోయ్. ప్రస్తుతం ఎకరా పదిహేను లక్షలు పలుకుతోంది" అన్నాడు శ్రీనివాసరావు. "పాతిక వచ్చేదాకా ఆగి అమ్మేద్దాం" అని కూడా అన్నాడు.

ఆ రోజు మా ఆనందానికి అవధుల్లేవు. ఇంట్లో పాయసం వండుకుని పండగలా సంబరపడిపోయాం.

ఐదు నెలలు గడిచేప్పటికి ఆ స్థలం ఇరవై లక్షలు ధర పలుకుతోందని చెప్పాడు.

ఓ రోజు హడావిడిగా మా యింటి కొచ్చాడు. పాతిక లక్షల ధర ఉందనీ, స్థలం అమ్మేద్దామని అంటాడనుకున్నా. విషయం అది కాదు.

"ఔటర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో స్వల్పంగా మార్పు జరిగిందట. అది ఎటుకి ఎంత జరిగిందో తెలిస్తేగాని మనశ్శాంతి ఉండదు" అన్నాడు.

అందులో కంగారు పడాల్సిన విషయమేమిటో నాకర్థం కాలేదు. మా యింటికొచ్చి ఈ విషయం నాకెందుకు చెప్పాడో తెలీలేదు.

రెణ్ణెల్లు గడిచాక మా యింటికో నోటీస్ వచ్చింది. నేను కొన్న ఎకరా పొలం ఔటర్ రింగ్ రోడ్డుకి కిలో మీటర్ పరిధిలో ఉన్నందున ప్రభుత్వం స్వాధీన పర్చుకుంటుందనీ, దానికి తగిన పరిహారం చెల్లిస్తుందనీ దాని సారాంశం.

గుండె జారిపోయిన భావన . . .శ్రీనివాసరావు దగ్గరకు పరుగెత్తా.

"ఏం చేస్తాం . . . మన దురదృష్టం. నీది ఎకరం పొలమే. నాది నాలుగెకరాలు" అన్నాడు.

అతని నాలుగెకరాల గురించి నాకెందుకు? నా ఎకరం పొలం గురించే దిగులంతా . . .

"అసలేం జరిగిందీ" బలహీన స్వరంతో అడిగా.

"మనం పొలం కొన్నప్పుడు ఆ స్థలం ఔటర్ రింగ్ రోడ్‌కి రెండు కిలోమీటర్ల దూరంలో ఉండింది. సేఫ్ అనుకున్నా. ఇపుడు అలైన్‌మెంట్ మారటం వల్ల ఒక కిలోమీటర్ ఇటుకి జరిగి మన పొలాల్ని మింగేసింది. మన కొంప ముంచింది. రింగ్ రోడ్‌కి ఒక కిలోమీటర్ అటూ ఇటూ ఏ రకమైన కట్టడాలు ఉండకూడదని ప్రభుత్వ నిర్ణయం. అందుకే ఆ పరిధిలోకొచ్చే స్థలాల్ని స్వాధీనపర్చుకుంటోంది."

"మరి నష్టపరిహారం ఎంతిస్తారు?" భయపడుతూనే అడిగా.

"చెప్పలేం . . .ఎకరాకు యాభైవేలు రావొచ్చు. లక్ష వస్తే మనం అదృష్టవంతుల కిందే లెక్క"

అనంతమైన దిగులు పిడిబాకులా గుచ్చుకుంది. గుండెల్లో నొప్పి . . . నా ఎకరా స్థలం మదపుటేనుగులా మారి తన భీకరమైన పాదాల్తో నా గుండెని తొక్కు తున్నట్లు . . . విపరీతమైన నొప్పి . . .

కుడిచేత్తో గుండెని పట్టుకుని అక్కడే కుప్పకూలిపోయాను.

**(నవ్య వార పత్రిక - 10 మే, 2006)**